ఓడిపోతామని తెలిసే.. ప్రధాని తడబాటు

లక్నో, మే 26: కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి రాదని తెలియటంతో.. ప్రధాని మోదీ తన ప్రసంగాల్లో తడబడుతున్నారని సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ అన్నారు. ఎన్నికల్లో గెలుపుపై ప్రధాని మోదీ ఆత్మ విశ్వాసం కోల్పోయారని అన్నారు. ఆదివారం సేలంపూర్ ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ ప్రధాని మోదీపై విమర్శలు ఎక్కుపెట్టారు. 'బీజేపీ ఓటమి ఖాయమన్న సంగతి ప్రధాని మోదీకి తెలుసు. అందుకే ప్రధాని మోదీ తన ఆత్మ విశ్వాసాన్ని కోల్పోయారు. ప్రసంగాల్లో ఆయన మాటలు తడబడుతున్నాయి. ప్రధాని పదవి చేజారిపోతుందన్న ఆందోళన ఆయనలో కనిపిస్తున్నది. 400కు మించి స్థానాలు సాధిస్తామన్న వారి నినాదం ఓడిపోవటం ఖాయం.' అని అఖిలేశ్ అన్నారు.

ఈవీఎం ధ్వంసం.. బీజేపీ అభ్యర్థి అరెస్టు

భువనేశ్వర్, మే 26: ఈవీఎంను ధ్వంసం చేశారన్న ఆరోపణలపై ఒడిశాలోని ఖుర్దా జిల్లాలో బీజేపీ అభ్యర్థిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం చిలికా నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న ప్రశాంత్ జగ్‌దేవ్ ఈసారి ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో ఖుర్దా నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేస్తున్నారు. ప్రశాంత్ జగ్‌దేవ్.. బోలాగడ్ బ్లాక్ పరిధిలోని కౌనిపత్నలో పోలింగ్ బూత్ నంబర్ 114లో ఓటేసేందుకు రాగా, ఈవీఎం పనిచేయక పోవడంతో కొంతసేపు క్యూలో నిలబడాల్సి వచ్చింది. దీంతో సహనం కోల్పోయిన ప్రశాంత్.. టేబుల్‌పై ఉన్న ఈవీఎంను లాగిపడేయటంతో పగిలిపోయిందని అధికారులు పేర్కొన్నారు.

కాంగ్రెస్ గెలిస్తే వాఘా సరిహద్దు తెరుస్తాం
పంజాబ్ మాజీ సీఎం చన్నీ

జలంధర్: పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, జలంధర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చరణ్‌జీత్ సింగ్ చన్నీ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పాకిస్తానీల కోసం వాఘా సరిహద్దును తెరుస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జలంధర్‌ను మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని, పాకిస్థాన్ ప్రజలు కూడా ఇక్కడకు వచ్చి వైద్య చికిత్స పొందేందుకు వాఘా సరిహద్దును తెరుస్తామని ప్రకటించారు.

సిక్కులను రెచ్చగొట్టేలా బీజేపీ యాడ్!

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ తాజాగా తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో విడుదల చేసిన ఒక యాడ్ వివాదాస్పదంగా మారింది. జూన్ 1న ఏడో దశలో భాగంగా సిక్కులు అధికంగా ఉండే పంజాబ్‌లో ఎన్నికలు జరుగనున్న తరుణంలో ముస్లింలకు వ్యతిరేకంగా సిక్కు మతస్తులను రెచ్చగొట్టేలా ఆ డిజిటల్ ప్రకటన ఉన్నదనే విమర్శలు వస్తున్నాయి. సిక్కులు, ఇతర కమ్యూనిటీల కంటే కాంగ్రెస్ ముస్లింలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని యాడ్ వర్ణించింది.

మోదీ మళ్లీ 'సీఎం' కావాలి: నితీశ్

పాట్నా: బీహార్ సీఎం, జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ ఆదివారం నోరు జారారు. ప్రధాని మోదీ మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షిస్తున్నానని చెప్పారు. ఒక ఎన్నికల ప్రచార సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'దేశంలో ఈసారి 400కు పైగా స్థానాలను గెలుచుకోవాలని కోరుకుంటున్నాం. మోదీ మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షిస్తున్నాం. దేశం, బీహార్ అభివృద్ధి చెందాలి' అని నితీశ్ కుమార్ అన్నారు.

కొండచరియల ప్రమాదంలో
670కి చేరిన మృతులు

మెల్‌బోర్న్: పపువా న్యూ గినియాలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న కొండచరియలు విరిగిపడ్డ ప్రమాదంలో మృతుల సంఖ్య భారీగా పెరిగింది. రాజధాని పోర్ట్‌మోర్స్‌బీకి 600 కిలోమీటర్ల దూరంలోని ఎంగా ప్రావిన్స్‌లో చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో 100 మంది మరణించి ఉంటారని తొలుత అంచనా వేశారు. అయితే మృతుల సంఖ్య 670కి పైగా ఉంటుందని ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ వలసల సంస్థ చీఫ్ శేర్హన్ అక్టోప్రాక్ ఆదివారం తెలిపారు.

ఆర్మీ చీఫ్ పాండే పదవీ కాలం పొడిగింపు
గత 50 ఏండ్లలో ఇదే తొలిసారి

న్యూఢిల్లీ: భారత సైన్యాధిపతి జనరల్ మనోజ్ పాండే పదవీ కాలాన్ని కేంద్ర ప్రభుత్వం నెల రోజులు పొడిగించింది. ఇది దాదాపు 50 ఏళ్ల తర్వాత జరిగిన అత్యంత అరుదైన నిర్ణయం. జనరల్ పాండే ఈ నెల 31న పదవీ విరమణ చేయవలసి ఉంది. ఆయన పదవీ కాలాన్ని జూన్ 30 వరకు పొడిగించేందుకు క్యాబినెట్ నియామకాల కమిటీ మే 26న ఆమోదించినట్లు రక్షణ శాఖ తెలిపింది. పాండే 2022 ఏప్రిల్‌లో ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు.

పంజాబ్ 'కింగ్స్' ఎవరు?

- 13 నియోజకవర్గాలకు జూన్ 1న పోలింగ్
- చతుర్ముఖ పోటీతో ఆసక్తికరంగా ఎన్నికల రణం
- 'ఇండియా' పక్షాలు ఆప్, కాంగ్రెస్ మధ్యే పోటీ
- పాత మిత్రులు శిరోమణి, బీజేపీ ఒంటరి పోరు
- ప్రచారంలోనే రైతుల ఆగ్రహాన్ని చవిచూస్తున్న బీజేపీ



చండీఘడ్, మే 26: లోక్‌సభ ఎన్నికల్లో దేశమంతా ఒకరకమైన రాజకీయ చిత్రం ఉంటే పంజాబ్ ఎన్నికల సంగ్రామం మాత్రం మరో రకంగా ఉంది. మిగతా అన్ని రాష్ర్టాల్లో బీజేపీ లేదా ఎన్డీఏ మిత్రపక్షాలు ప్రధాన పోటీదారుగా ఉంటే పంజాబ్‌లో మాత్రం ఇండియా కూటమిలోనే ప్రధాన పోటీ నెలకొన్నది. 13 లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్న రాష్ట్రంలో చతుర్ముఖ పోటీ కనిపిస్తున్నప్పటికీ ప్రధాన పోటీ మాత్రం ఇండియా కూటమిలో భాగస్వామ్యపక్షాలైన ఆమ్ ఆద్మీ పార్టీ - కాంగ్రెస్ మధ్యనే నెలకొన్నది. ఈ రెండు పార్టీలను ఎదుర్కొనేందుకు శిరోమణి అకాలీదళ్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఇక, 1996 తర్వాత పంజాబ్‌లో మొదటిసారి ఒంటరిగా పోటీ చేస్తున్న బీజేపీ ఇక్కడ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ముఖ్యంగా రైతుల నిరసనలు బీజేపీ అభ్యర్థులకు సెగలు పుట్టిస్తున్నాయి.

పూర్వవైభవం కోసం కాంగ్రెస్ ప్రయత్నాలు

గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇక్కడ మెరుగైన ఫలితాలు సాధించింది. 13 సీట్లలో ఎనిమిది స్థానాలను గెలుచుకుంది. ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా పోటీ చేసిన శిరోమణి అకాలీదళ్ రెండు స్థానాలను, బీజేపీ రెండు స్థానాలను, ఆప్ ఒక స్థానాన్ని గెలుచుకున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆప్ పంజాబ్‌పై చాలా ఆశలు పెట్టుకున్నాయి. మెజారిటీ స్థానాలు దక్కించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇతర రాష్ర్టాల్లో ఈ రెండు పార్టీలు కలిసి ఎన్నికల బరిలో దిగినప్పటికీ పంజాబ్‌లో మాత్రం సీట్ల పంపిణీ కుదరకపోవడంతో వేర్వేరుగా పోటీ చేస్తున్నాయి. దీంతో కాంగ్రెస్‌కు ఆప్ నుంచి గట్టి పోటీ ఎదురవుతున్నది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 40.12 శాతం ఓట్లను సాధించినప్పటికీ 2022 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం కేవలం 22.98 శాతానికి పడిపోయింది. మాజీ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ రాజీనామా చేయడం, మాజీ పీసీసీ అధ్యక్షుడు నవజోత్ సింగ్ సిద్ధు పార్టీతో అంటీముట్టనట్టు ఉండటం కాంగ్రెస్‌కు మైనస్‌గా మారింది. ఈసారి కచ్చితంగా ఓటుబ్యాంకును పెంచుకోవాలని, గత ఎన్నికల్లో సాధించిన సీట్ల సంఖ్యను నిలుపుకోవాలని కాంగ్రెస్ గట్టిగా ప్రయత్నిస్తున్నది.

అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆప్

ఢిల్లీ తర్వాత ఆప్ బలంగా ఉన్నది, అధికారం చేపట్టింది పంజాబ్‌లోనే. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ ఆప్‌కు చేదు ఫలితాలు దక్కాయి. ఆ పార్టీ కేవలం 7.38 శాతం ఓట్లతో ఒకే ఒక్క స్థానాన్ని గెలుచుకుంది. కానీ, మూడేండ్లలోనే అనూహ్యంగా పుంజుకొని 2022 అసెంబ్లీ ఎన్నికల్లో 42 శాతం ఓట్లు, 92 స్థానాలను దక్కించుకొని అధికారంలోకి వచ్చింది. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లోనూ మొత్తం 13 స్థానాలను దక్కించుకునేందుకు ఆప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. అందుకే, ఐదుగురు రాష్ట్ర మంత్రులను, ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలను ఎన్నికల బరిలో నిలిపింది. ఢిల్లీలో ఎన్నికలు ముగిసే వరకు ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఒక్కరే ప్రచార బాధ్యతలు మోయగా, తాజాగా అరవింద్ కేజ్రీవాల్ కూడా పంజాబ్‌లో పెద్ద ఎత్తున ప్రచారాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులు, బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న రైతుల ఓట్లపై ఆప్ భారీగా ఆశలు పెట్టుకుంది. అయితే, మహిళలకు నెలకు రూ.1,000 హామీ నెరవేర్చకపోవడం, సింగర్ సిద్ధూ మూసేవాలా అంశం ఆప్‌కు ప్రతికూలంగా మారాయి.

అకాలీదళ్‌కు జీవన్మరణ సమస్య

పంజాబ్‌లో ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన శిరోమణి అకాలీదళ్ క్రమంగా బలహీనంగా మారిపోయింది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం మూడు స్థానాలకు, 18 శాతం ఓట్లకు పార్టీ పరిమితమైంది. దీంతో లోక్‌సభ ఎన్నికలు అకాలీదళ్‌కు జీవన్మరణ సమస్యగా మారాయి. అకాలీదళ్‌కు ప్రధాన బలమే గ్రామీణ ప్రాంతాలు, రైతుల ఓట్లు. అయితే, కేంద్రం చేసిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతుల ఆందోళనల ప్రభావం బీజేపీతో పాటు అకాలీదళ్‌పై కూడా భారీగానే పడింది. కాగా, అకాలీదళ్ కనుక మెరుగైన ఓట్లను సాధించగలిగితే, కాంగ్రెస్, ఆప్ మధ్య ఓట్ల చీలిక ఆ పార్టీకి కలిసిరావొచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు అకాలీదళ్ చీలిక వర్గం శిరోమణి అకాలీదళ్(అమృత్‌సర్) కూడా 13 స్థానాల్లో పోటీ చేస్తుండటంతో ఆ పార్టీ చీల్చే ఓట్లు అకాలీదళ్‌కు మైనస్‌గా మారనున్నాయి.

బీజేపీకి నిరసనల సెగలు

పంజాబ్‌లో మొదటి నుంచి బీజేపీ పాత్ర పరిమితంగానే ఉండేది. మూడు దశాబ్దాలుగా శిరోమణి అకాలీదళ్ వేలు పట్టుకొని నడుస్తున్న కమలం పార్టీ ఈసారి ఒంటరిగా బరిలో దిగుతున్నది. రైతుల ఆగ్రహాన్ని ఇక్కడ బీజేపీ చవిచూస్తున్నది. బీజేపీ అభ్యర్థులు గ్రామాల్లో ప్రచారానికి వెళ్లినప్పుడు రైతుల నుంచి పెద్ద ఎత్తున నిరసన సెగలు తగులుతున్నాయి. మోదీ ఇమేజ్, హిందూ ఓటు బ్యాంకు, అర్బన్ ప్రాంతాల్లో ఓట్లపై బీజేపీ ఆశలు పెట్టుకుంది. బీజేపీ ప్రధానంగా గత రెండు ఎన్నికల్లో గెలిచిన హోషియార్‌పూర్, ఐదుసార్లు గెలిచిన గుర్‌దాస్‌పూర్‌తో పాటు అమృత్‌సర్, జలంధర్, లూధియానా, ఫరీద్‌కోట్, పాటియాలా స్థానాలపైనే దృష్టి సారించింది.

పంజాబ్‌పై ఇండియా కూటమి ఆశలు

పంజాబ్‌లోని మొత్తం 13 లోక్‌సభ స్థానాల్లోనూ ఆప్, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ ఉన్నది. ఈ రెండు పార్టీలు ఎన్ని స్థానాలు గెలిచినా అవి ఇండియా కూటమి ఖాతాలోనే పడతాయి. దీంతో పంజాబ్ సీట్ల సంఖ్యపై ఇండియా కూటమి చాలా ఆశలు పెట్టుకుంది. పలు స్థానాల్లో శిరోమణి అకాలీదళ్ కూడా ఈ పార్టీలకు గట్టి పోటీ ఇస్తున్నది. బీజేపీ ప్రధానంగా పంజాబ్‌లో సొంత కాళ్లపై నిలబడే శక్తిని కూడగట్టుకోవడానికి, రెండంకెల ఓట్ల శాతాన్ని పొందడంపైనే ఆశలు పెట్టుకుంది. ఇక, ఖదూర్ సాహిబ్ నియోజకవర్గంపై కూడా ఆసక్తి నెలకొన్నది. ప్రస్తుతం అస్సాం జైలులో ఉన్న ఖలిస్థానీ నేత అమృత్‌పాల్ సింగ్ ఇక్కడి నుంచి మైక్ గుర్తుపై స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆయన తరపున కుటుంబసభ్యులు, అనుచరులు ప్రధాన పార్టీలకు దీటుగా ప్రచారం చేస్తున్నారు. దీంతో అమృత్‌పాల్ ఏ మేరకు ఓట్లు సాధిస్తారనేది ఇక్కడ ఇతర పార్టీల గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశం ఉంది.

గడ్కరీ ఓటమికి మోదీ, షా యత్నం!

- విపక్షాలకు డిప్యూటీ సీఎం ఫడ్నవీస్ సహకారం
- ఆరెస్సెస్ నేతలే ఈ విషయాన్ని చెబుతున్నారు
- శివసేన నేత సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు

సంజయ్

ముంబై/నాగ్‌పూర్, మే 26: శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని లోక్‌సభ ఎన్నికల్లో ఓడించేందుకు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రయత్నించారని ఆరోపించారు. గడ్కరీ మూడోసారి నాగ్‌పూర్ నుంచి బరిలోకి దిగారు. గడ్కరీని ఓడించడం సాధ్యం కాదని భావించిన ఫడ్నవీస్.. అయిష్టంగానే ప్రచారంలో పాల్గొన్నారని సంజయ్ రౌత్ పేర్కొన్నారు. గడ్కరీని ఓడించేందుకు ఫడ్నవీస్ ప్రతిపక్షానికి సహకరించారని నాగ్‌పూర్‌లోని ఆరెస్సెస్ నేతలు బహిరంగంగానే చెబుతున్నారని పార్టీ అధికారిక పత్రిక సామ్నాలో ఆదివారం రాసిన వ్యాసంలో రౌత్ చెప్పుకొచ్చారు. మరోవైపు డిప్యూటీ సీఎం అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ అభ్యర్థులను ఓడించేందుకు సీఎం ఏక్‌నాథ్ షిండే, ఆయన వర్గం.. ప్రతి నియోజకవర్గంలో 25-30 కోట్ల చొప్పున పంపిణీ చేసిందని సంజయ్ రౌత్ ఆరోపించారు.

కాంగ్రెస్ అభ్యర్థి అసంతృప్తి..

సంజయ్ రౌత్ వ్యాఖ్యలను మహారాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాంకులే ఖండించారు. ఆయన భ్రమలు పడుతున్నారని, బీజేపీ అంటే ఒక పార్టీ కాదని, ఒక కుటుంబం అని అన్నారు. రౌత్ వ్యాఖ్యలపై నాగ్‌పూర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వికాస్ థారే స్పందించారు. నాగ్‌పుర్‌లో గడ్కరీ గెలుస్తారన్న రౌత్ వ్యాఖ్యలపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఎన్డీయే మళ్లీ గెలిస్తే కొలీజియం రద్దు

మొదటిపేజీ తరువాయి...

ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. తాను పోటీ చేస్తున్న కర్కాట్ లోక్‌సభ పరిధిలో ఆదివారం జరిగిన ఎన్నికల సభలో ఈ రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్‌ఎల్‌ఎం) నేత మాట్లాడుతూ 'కొలీజియం వ్యవస్థలో అనేక లోపాలు ఉన్నాయి. అది అప్రజాస్వామికంగా ఉంది. ఈ సిస్టమ్ అత్యున్నత న్యాయ వ్యవస్థలో దళితులు, ఓబీసీలే కాక అగ్రవర్ణాలలోని పేదలను జడ్జీల నియామకానికి సంబంధించిన మార్గాలను మూసివేసింది' అని ఆరోపించారు. ప్రస్తుతం సుప్రీం కోర్టు, హైకోర్టులలో బెంచ్‌లకూర్పు చూస్తే అవి కొన్ని కుటుంబాలకు చెందిన సభ్యుల ఆధిక్యతతో నిండి ఉన్న విషయం తెలుస్తుందన్నారు. కాగా, కుశ్వాహ వ్యాఖ్యలను ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ తప్పుబట్టారు. యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉండగా కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ఆయన కొలీజియం వ్యవస్థపై ఎన్నడూ ఎందుకు ఇలాంటి విమర్శలు చేయలేదని ప్రశ్నించారు.

వచ్చే టర్మ్‌లో యూసీసీ, జమిలి అమలు: అమిత్‌షా

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే వచ్చే ఐదేండ్లలో దేశవ్యాప్తంగా ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ)ని అమలు చేస్తామని కేంద్ర మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. అదేవిధంగా 'ఒక దేశం-ఒక ఎన్నికను(జమిలి ఎన్నికలు)' కూడా మోదీ ప్రభుత్వం అమలు చేస్తుందని పీటీఐ వార్తా సంస్థకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. దేశంలో ఏకకాల ఎన్నికలు నిర్వహించాల్సిన సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు. జమిలి ఎన్నికలకు మనం సిద్ధమైతే, ఎన్నికలను ప్రస్తుతం నిర్వహిస్తున్న వేసవి కాలంలో కాకుండా శీతాకాలం లేదా మరో సమయానికి మార్చే సాధ్యాసాధ్యాలపై ఆలోచిస్తామని పేర్కొన్నారు.

దవాఖాన వద్ద ఆధారాలు సేకరిస్తున్న ఫోరెన్సిక్ టీమ్

దవాఖానలో అగ్ని ప్రమాదం

- ఏడుగురు నవజాత శిశువులు దుర్మరణం
- లైసెన్స్ గడువు తీరినా హాస్పిటల్ నిర్వహణ

న్యూఢిల్లీ, మే 26: తూర్పు ఢిల్లీలోని వివేక్ విహార్‌లో గల ఓ ప్రైవేట్ పిల్లల దవాఖానలో శనివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో ఏడుగురు నవజాత శిశువులు మరణించడం వారి కుటుంబాలకు తీరని శోకాన్ని మిగిల్చింది. స్థానికులు భవనం వెనకవైపు నుంచి లోపలికి వెళ్లి 12 మంది శిశువులను బయటకు తీసుకుని రాగలిగారు. అయితే అప్పటికే వారిలో ఏడుగురు చనిపోయారు. మిగిలిన శిశువులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదంలో మంటలు పక్కనున్న మరో రెండు భవనాలకు కూడా వ్యాపించాయి. రెండంతస్తుల దవాఖాన భవనంలో ఆక్సిజన్ సిలిండర్లు పేలడం వల్ల మంటలు చెలరేగాయని డివిజినల్ అగ్నిమాపక అధికారి రాజేంద్ర తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని క్షమించేది లేదని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. దవాఖాన ఉన్న భవనంలో అనుమతి లేకుండా ఆక్సిజన్ సిలిండర్లను రీ ఫిల్లింగ్ చేస్తున్నారని స్థానికుడు ఒకరు తెలిపారు. ప్రమాదం జరిగిన దవాఖాన యజమాని నవీన్ కిచీని పోలీసులు అరెస్ట్ చేశారు. దవాఖానకు వైద్యశాఖ జారీ చేసిన లైసెన్స్ గడువు మార్చి 31నే ముగిసినట్టు విచారణలో తేలింది. ఈ వైద్యశాలకు అగ్నిమాపక శాఖ నిరభ్యంతర పత్రం కూడా లేనట్టు తెలిసింది.

'రెమాల్' కల్లోలం

- అర్ధరాత్రి బెంగాల్ తీరాన్ని దాటనున్న తుఫాన్
- సురక్షిత ప్రాంతాలకు లక్ష మందికి పైగా తరలింపు
- కోల్‌కతాలో 21 గంటలు విమాన సర్వీసులు బంద్

కోల్‌కతా/ఢాకా/హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): తీవ్ర తుఫానుగా బలపడిన 'రెమాల్' పశ్చిమబెంగాల్‌లోని సాగర్ ఐలాండ్స్, బంగ్లాదేశ్‌లోని మంగ్లా పోర్టు సమీపంలోని ఖేపుపుర మధ్య ఆదివారం అర్ధరాత్రి సమయంలో తీరం దాటుతుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అంచనా వేసింది. తీరం దాటే సమయంలో గంటలకు 120-135 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు రెమాల్ ఆదివారం రాత్రి బంగ్లాదేశాన్ని తీరాన్ని తాకిందని, బెంగాల్ తీరాన్ని దాటే ప్రక్రియను ప్రారంభించిందని అక్కడి అధికారులు వెల్లడించారు. స్థానిక కాలమానం ప్రకారం అర్ధరాత్రి 12.00-1.00 మధ్య తీరాన్ని దాటుతుందని, ఆ తర్వాత రెమాల్ తుఫాన్ బలహీనపడుతుందని తెలిపారు.

తీర ప్రాంత ప్రజలకు హెచ్చరికలు

పశ్చిమబెంగాల్ తీర ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. లక్ష మందికి పైగా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కోల్‌కతా ఎయిర్‌పోర్టు అధికారులు ఆదివారం మధ్యాహ్నం నుంచి 21 గంటల పాటు విమాన సర్వీసులను రద్దు చేశారు. కాగా, తుఫాన్ నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో 8 లక్షల మందికి పైగా ప్రజలను అక్కడి అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తుఫాను ప్రభావంతో ఒడిశా, బెంగాల్, ఈశాన్య రాష్ర్టాల్లో మంగళవారం వరకు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

బంగ్లాదేశ్‌లోని బరిసల్ తీరంలో వాహనాలను ముంచెత్తిన సముద్ర జలాలు

అమెరికాలో తుఫాన్ బీభత్సం

ఆస్టిన్, మే 26: అమెరికాలో శనివారం రాత్రి మరో తుఫాన్ విరుచుకుపడి మూడు రాష్ర్టాలపై పంజా విసిరింది. శనివారం ప్రారంభమైన ఈ తుఫాన్ టెక్సాస్, ఓక్లహామా, అర్కెన్సాస్ రాష్ర్టాలను కుదిపేసింది. ఈ తుఫాన్ విధ్వంసానికి 11 మంది మరణించగా, వందలాది మంది గాయపడ్డారు. వందలాది ఇళ్లు ధ్వంసమయ్యాయి. వేలాది మంది విద్యుత్తు లేక అంధకారంలో మగ్గారు. పలు ప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయి. రాష్ర్టాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలువురు ప్రయాణికులు రహదారులపై చిక్కుకుపోయారు.

ఖతార్ విమానంలో కుదుపులు
12 మందికి గాయాలు

లండన్: ఖతార్ ఎయిర్‌వేస్‌కు చెందిన విమానం తీవ్ర కుదుపులకు గురి కావడంతో 12 మంది ప్రయాణికులు, సిబ్బంది గాయపడ్డారు. దోహ నుంచి డబ్లిన్‌కు వెళ్తున్న క్యూఆర్017 బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్‌లో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. గాయపడ్డవారిని దవాఖా నలకు తరలించారు. కాగా, ఐదు రోజుల క్రితం లండన్ నుంచి సింగపూర్ వెళ్తున్న విమానంలో కూడా ఇలాంటి ప్రమాదమే చోటు చేసుకోగా, ఒక ప్రయాణికుడు మృతి చెందగా, 25 మంది గాయపడ్డారు.

తల్లి పాలు విక్రయిస్తే కఠిన చర్యలు

న్యూఢిల్లీ: ఆవు, గేదె పాలు అమ్మినట్టు మార్కెట్లో 'తల్లి పాలు' అమ్మకానికి పెట్టడానికి వీల్లేదని 'భారత ఆహార భద్రత, ప్రమాణాల సాధికారిక సంస్థ' (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) హెచ్చరించింది. తల్లి పాలను ప్రాసెస్ చేసి అమ్మినా, ఉత్పత్తులను తీసుకొచ్చినా చట్ట ప్రకారం నేరమని తెలిపింది. ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ఈమేరకు రాష్ర్టాలకు అడ్వైజరీ జారీచేసింది. హ్యూమన్ మిల్క్‌ను ప్రాసెస్ చేయటానికి, అమ్మకానికి ఎలాంటి అనుమతులూ మంజూరు చేయరాదని రాష్ర్టాలకు సూచించింది. దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించింది.

రాజ్‌కోట్ ఘటనలో 33కు చేరిన మృతులు

బాధితుల్లో తొమ్మిది మంది పిల్లలు
సుమోటోగా తీసుకున్న గుజరాత్ హైకోర్టు

గేమ్‌జోన్‌లో శిథిలాల తొలగింపు

రాజ్‌కోట్, మే 26: గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో గల టీఆర్‌పీ గేమ్‌జోన్‌లో శనివారం జరిగిన అగ్నిప్రమాద ఘటనలో మృతుల సంఖ్య 33కు చేరింది. మృతుల్లో తొమ్మిది మంది పిల్లలు కూడా ఉన్నారు. మృతుల శరీరాలు గుర్తుపట్టలేకుండా మారిపోయాయి. దీంతో కుటుంబసభ్యులకు అప్పగించేందుకుగానూ మృతదేహాల డీఎన్ఏ నమూనాలు తీసుకొని పరీక్షిస్తున్నారు. ప్లేజోన్‌లో వెల్డింగ్ పనులు చేస్తున్నప్పుడు మంటలు వ్యాపించి ప్రమాదం సంభవించినట్టు ప్రాథమికంగా గుర్తించారు. కాగా, ఈ ఘటన పట్ల గుజరాత్ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది 'మనిషి చేసిన విపత్తు' అని కోర్టు పేర్కొన్నది. సుమోటోగా తీసుకొని విచారణ ప్రారంభించింది. మరోవైపు ఈ ఘటనలో ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేశారు.

ఒకే కుటుంబంలో ఐదుగురు మృతి..

రాజ్‌కోట్ అగ్నిప్రమాద ఘటనలో ఒక్కో కుటుంబానిది ఒక్కో విషాద గాథ. మరణించిన వారిలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఉన్నారు. మంటల్లో చిక్కుకొన్న తన కుమారుడు, మరో ముగ్గురు కుటుంబసభ్యులను కాపాడేందుకు వెళ్లిన వీరేంద్ర సిన్హ్ జడేజా(42) కూడా బయటకు రాలేకపోయాడని అతని కుమార్తె దేవికాబా పేర్కొన్నారు. వీరిలో ముగ్గురు 10-15 మధ్య ఏండ్ల వయసు వారని తెలిపారు. మరోవైపు బాధితుల్లో కొత్తగా పెండ్లి అయిన జంట వివేక్(26), కుషాలి దుసరా(24) ఉన్నారు.

ఒక్క నిమిషంలోనే ఫుల్ చార్జింగ్
కొత్త సాంకేతికతను తయారుచేసిన అంకుర్ గుప్తా



న్యూఢిల్లీ, మే 26: సాధారణంగా మొబైల్ ఫోన్‌లలో చార్జింగ్ 100 శాతం ఎక్కడానికి కనీసం అరగంట సమయం పడుతుంది. ల్యాప్‌టాప్‌లలో అయితే గంటకు పైనే అవసరం. ఎలక్ట్రిక్ వాహనాలకు ఐదారు గంటలు చార్జింగ్ పెట్టాల్సి ఉంటుంది. ఇంత సమయం లేనప్పుడు వినియోగదారులు పడే ఇబ్బంది అంతా ఇంతా కాదు. ఈ నేపథ్యంలోనే కేవలం ఒకే ఒక్క నిమిషంలో ఫోన్‌కు 0 శాతం నుంచి 100 శాతం వరకు చార్జ్ చేయగలిగే కొత్త సాంకేతికతను కొలరాడో యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అంకుర్ గుప్తా అభివృద్ధి చేశారు. ఈ కొత్త సాంకేతికత ద్వారా ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్‌లకు ఒక్క నిమిషంలో, ఎలక్ట్రిక్ కారుకు 10 నిమిషాల్లోనే ఫుల్ చార్జింగ్ చేయొచ్చని అంకుర్ తెలిపారు. విద్యుత్ గ్రిడ్లలో వేగంగా విద్యుత్తును నిల్వ చేయడానికి కూడా ఈ సాంకేతికత ఉపయోగపడుతుందని చెప్పారు. సాధారణంగా ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు చార్జింగ్ సమస్యే ప్రధాన అడ్డంకిగా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా సాంకేతికత ఈ సమస్యకు పరిష్కారం చూపనుంది.

ఎబోలా వైరస్ కొత్త మ్యుటెంట్

- *ల్యాబ్‌లో సృష్టించిన చైనా శాస్త్రవేత్తలు*
- *సోకితే మూడు రోజుల్లోనే మరణం!*

బీజింగ్, మే 26: చైనా శాస్త్రవేత్తలు ప్రమాదకర ఎబోలా వైరస్‌లో కొత్త మ్యుటెంట్‌ను సృష్టించారు. ఎబోలా వైరస్ ద్వారా వచ్చే వ్యాధి, లక్షణాలపై అధ్యయనం కోసం వైరస్‌లోని కొన్ని భాగాలను తీసుకొని కొత్త వేరియంట్‌ను తయారుచేశారు. హెబీ మెడికల్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు చేసిన ఈ అధ్యయనం వివరాలు 'సైన్స్ డైరెక్ట్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ ప్రాణాంతక వైరస్‌ను ఐదు మగ, ఐదు ఆడ చిట్టెలుకలకు ఇంజెక్షన్ ద్వారా ఇవ్వగా అవి మూడు రోజుల్లోనే చనిపోయాయి. మనుషులకు ఎబోలా వైరస్ సోకినప్పుడు వివిధ శరీర అవయవాలు విఫలమడంతో పాటు కనిపించిన ప్రమాదకర లక్షణాలే చిట్టెలుకల్లో కూడా కనిపించాయి. చిట్టెలుకల్లోకి వైరస్ పంపించిన తర్వాత వాటి కనుబొమ్మలు మొత్తం స్రావాలతో నిండిపోయి, చూపు మందగించింది. చనిపోయిన చిట్టెలుకలను పరిశీలించగా గుండె, కాలేయం, ప్లీహం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కడుపు, ప్రేగులు, మెదడు కణజాలంలో వైరస్ ఉన్నట్టు గుర్తించారు. తమ అధ్యయనం విజయవంతమైందని, ఎబోలా వైరస్‌ను ఎదుర్కొనేందుకు ఎలాంటి ఔషధాలు అవసరమో తెలుసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. కాగా, కరోనా వైరస్ కూడా చైనాలోని వుహాన్‌లో ఒక ల్యాబ్ నుంచి బయటకు సోకిందనే ఆరోపణలు ఉన్నాయి.